www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 14 సెప్టెంబర్ 2024

5

అన్నమయ్య



ఎపిఎండిసి మాజీ ఎండి వెంకట్‌రెడ్డి అత్త ఇంట్లో ఎసిబి సోదాలు



తనిఖీలు నిర్వహించి బయటకు వస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: ఎపిఎండిసి మాజీ ఎండి వెంకటరెడ్డి అత్త ఇంట్లో గురువారం అర్ధరాత్రి ఎసిబి డిఎస్‌పి గిరిధర్ బృందం సోదాలు నిర్వహించారు. పట్టణంలోని వెంకట్‌రెడ్డి మామ కీ.శే.శియ్యవరం సుధాకర్‌రెడ్డి సతీమణి రామ కోటమ్మ, వారి కుమారుడు మధుసూదన్‌రెడ్డి నివాసంలో వారిని ప్రశ్నించి సోదాలు నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డిని తన ఇంటి పైన ఉన్న రూముకి తీసుకెళ్లి తన బావ వెంకట్‌రెడ్డి పంపిన రెండు లారీల సామాన్లను చూపించారు. అక్కడే అతన్ని ప్రశ్నించారు. వెంకట్‌రెడ్డి అత్త రామకోటమ్మను లేడీ కానిస్టేబుల్‌తో ప్రశ్నించారు. సోదాల అనంతరం ఎసిబి డిఎస్‌పి గిరిధర్ విలేకరులతో మాట్లాడుతూ వెంకటరెడ్డిపై కేసు నమోదైందన్నారు. ఆయన అత్త, బావమరిది ఇంటిపై సోదాలు నిర్వహించామన్నారు. ఈ సోదాలలో ఆధారాలు దొరికాయా అని ప్రశ్నించగా ఉన్నతాధికారులు పూర్తి వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు.

గండికోటకు జలకళ

తొలిసారి 25.5 టిఎంసిలు చేరిక



కృష్ణాజలాలతో కళకళలాడుతుదున్న గండికోట జలాశయం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గండికోట జలాశయం జలకళను సంతరించుకుంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈ ఏడాది ఆగస్టు 10న కర్నూలు జిల్లాలోని అవుకు రిజర్వాయర్ నుంచి 10,500 క్యూసెక్కులను గండికోట జలాశయానికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ రెండు సార్లు పూర్తి స్థాయిలో నిండిన నేపథ్యంలో నీటిపారుదలశాఖ గండికోట రిజర్వాయర్‌కు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయానికి 32 రోజుల వ్యవధిలోనే 25.5 టిఎంసిల మేర పూర్తి స్థాయిలో నిల్వ చేయడం గమనార్హం. 2020లో వైసిపి సర్కారు హయాంలో 26 టిఎంసిల మేరకు నిల్వ చేసిన సంగతి తెలిసిందే. గండికోట రిజర్వాయర్ పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంటున్న నేపథ్యంలో మూడ్రోజుల ముందుగానే పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను పెన్నానదీ తీరానికి రాకుండా చూడాలని నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం అప్రమత్తం చేసింది. గండికోట పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకున్న నేపథ్యంలో గండికోట జలాశయం నుంచి పైడిపాలెంకు 1000 క్యూసెక్కులు, సర్వరాయసాగర్‌కు 900 క్యూసెక్కులు, జికెఎల్‌ఐ పైప్‌లైన్ల ద్వారా 10 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన చిత్రావతి రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. చిత్రావతికి 1500 క్యూసెక్కుల మేర తరలిస్తున్నారు. ఐదు టిఎంసిలను నిల్వ చేయడానికి జిల్లా నీటిపారుదలశాఖ సిద్ధమైనట్లు తెలుస్తోంది. మైలవరం రిజర్వాయర్‌కు సుమారు 2,500 క్యూసెక్కులను తరలిస్తోంది. మైలవరం రిజర్వాయర్ నుంచి 3,000 క్యూసెక్కుల మేర పెన్నానదికి నీటిని విడుదల చేస్తోంది. పెన్నానది పరవళ్లు తొక్కుతూ సోమశిల దిశగా సాగిపోతోంది.

స్వచ్ఛత అందరి బాధ్యత : కలెక్టర్



స్వచ్ఛతా హీ సేవా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు 'స్వచ్ఛతా హీ సేవా' పేరుతో వివిధ విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి డివిజన్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ దివస్ నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం 15 రోజులపాటు జరగనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను సమన్వయంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, మొదలగు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హి సేవ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యాన వనాలు- పర్యాటక కేంద్రాల సుందరీకరణ తదితర పనులు చేపట్టాలని చెప్పారు. మిషన్ లైఫ్ క్యాంపెన్‌లో భాగంగా సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఆహార అలవాట్లు, ఆరోగ్యం, ఈ వేస్ట్‌ల పై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, చెత్త కుప్పలు, బోరు బావుల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఎంపిడిఒలు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇలు, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. సఫాయి మిత్రా సురక్ష కింద సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించడం, ఆరోగ్య సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున తల్లి పేరున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా చెరువులు, కుంటల కాలువల వద్ద వ్యర్థపదార్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం కింద అన్ని మున్సిపాల్టీల్లో, అన్ని గ్రామ పంచాయతీల్లో శ్రమదానం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మెప్మా, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలను భాగస్వాములను చేసుకొని కార్యక్రమాలు ర్యాలీలు నిర్వహించాలన్నారు. మండల పరిషత్, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను, ఇతర శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహి సేవ ప్రచార పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆవిష్కరించారు. సమావేశంలో డ్వామా, డిఆర్‌డిఎ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయితీ, జిల్లా పరిషత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గొప్ప మేధావి సీతారాం ఏచూరి

- ఆయన మరణం తీరని లోటు
- సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



మదనపల్లె : ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గొప్ప మేధావని, ఆయన మరణం వామపక్ష ఉద్యమానికే కాకుండా దేశానికే తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సిపిఎం మదనపల్లి కమిటీ అధ్వర్యంలో ఏచూరి సంతాప సభను స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. సమావేశంలో ఏచూరి మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ సమస్యలపై అనర్గళంగా మాట్లాడే వ్యక్తి ఏచూరి అని తెలిపారు. దేశంలో ఉన్న మతోన్మాద ప్రభుత్వం నానాటికి మీతిమిరి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేసే ప్రయత్నం సిపిఎం చేస్తోందని చెప్పారు. ఈ కర్తవ్యాన్ని నిర్వహించగల వ్యక్తి ఏచూరి అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయన సేవలు చాలా అవసరమని తెలిపారు. ఇలాంటి సమయంలో ఆయన మ ృతి పార్టీకి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. పార్టీ కార్యకర్తల పట్ల ప్రేమ, అప్యాయతతో ఉంటూ తన జీవితాన్ని పార్టీకి అంకితం చేశారన్నారు. ఏచూరి అడుగు జాడల్లో నడుస్తూ బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలని అదే ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అని పిలుపునిచ్చారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మికులు, రైతాంగానికి అండగా సిపిఎంను నిలబెట్టేందుకు కృషి చేశారని తెలిపారు. విద్యార్థి ఉద్యమ దశలో ఏచూరి ఒక ఐకానిక్‌గా నిలిచారని కొనియాడారు. ఇందిరాగాంధీ సమయంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర, రెడ్డిప్రసాద్, ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఉద్యమ సూర్యుడు సీతారాం ఏచూరికి అస్తమయం లేదని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేల్ రవికుమార్, నంద్యాల శంకరమ్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వామపక్ష భావాలు కలిగి అలుపెరగని ఉద్యమాలు చేసి ప్రజల హృదయాలలో చెదరని ముద్ర వేసుకున్న మహనీయుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఆయన బతికున్నంత కాలం తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేయడంతో పాటు తన మరణాన్ని కూడా సమాజ పరం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణ, సిఐటియు నాయకులు రమణ, ప్రసాద్, ఓబయ్య, రాముడు, రవి మధు పాల్గొన్నారు. **ఎస్‌ఎఫ్‌ఐ నాయాకుల నివాళి :** పేద విద్యార్థుల, కార్మికుల గొంతు మూగబోయిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ పేర్కొన్నారు. ఏచూరి మృతి పట్ల ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సంతాపం తెలిపారు. సంతాప సభలో ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్, గిరి, సంతోష్, బబ్లు, చరణ్, సురేష్, అశోక్, సుబ్రహ్మణ్యం, కుమార్, కిరణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ అన్నారు. సిఐటియు ఆఫీసులో ఏచూరి చిత్రపటానికి పూలమాలేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మణి, సిఐటియు మండల అధ్యక్షులు సి.పుల్లయ్య, మండల కార్యదర్శి జాన్ ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎన్.రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధా కుమారి, సెక్టార్ లీడర్ దుర్గ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాజశేఖర్, ఆటో యూనియన్ నాయకులు సిద్దు, మల్లి పాల్గొన్నారు. **పీలేరు:** సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటును మిగిల్చిందని ఆ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు పురుషోత్తం, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తూ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్. రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకట్రామయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు హెచ్‌ఎం బాబు, కెసిఎస్ రెడ్డి, హమాలీ నాయకులు నాగరాజ, ప్రజా సంఘం నాయకులు గుర్రం నారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చిట్వేలి :** సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని మండల సిపిఎం నాయకులు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, చిట్వేల్ ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎపిఎండిసి పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్ , వ్యవసాయ కార్మిక కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి, సిఐటియు మండల కార్యదర్శి వై.సుజాత, సుధామణి, గురవయ్య విఆర్‌ఎ డివిజన్ అధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు.



రాజంపేట : నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

లింగ నిర్ధారణ చేస్తూ పట్టుబడ్డ వైద్యుడు



లింగ నిర్ధారణ చేస్తూ పట్టుబడిన వైద్యుడితో జిల్లా అధికారి, తహశీల్దారు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో లింగ నిర్ధారణ చేస్తున్న ఓ వైద్యుడు జిల్లా వైద్యాధికారులకు శుక్రవారం పట్టుబడ్డాడు. లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని తెలిసినా పీలేరు రైల్వేగేట్ సమీపంలోని నోబుల్ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రొంపిచర్ల బాష లింగ నిర్ధారణ చేస్తున్నట్లు జిల్లా ఉన్నత అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు డిఐఒ, డిప్యూటీ డెమో డాక్టర్ దేవశిరోమణి, తహశీల్దార్ భీమేశ్వరరావు లింగ నిర్ధారణ కేంద్రంపై దాడులు చేశారు. ఇదే సమయంలో ఆ వైద్యుడు లింగ నిర్ధారణ చేస్తూ పట్టుబడ్డంతో ఆ కేంద్రాన్ని అధికారులు జప్తు చేశారు. డాక్టర్ బాష గతంలోనూ స్కానింగ్ చేస్తూ అధికారుల దాడులో పట్టుబడడంతో అధికారులు ఆ లింగ నిర్ధారణ కేంద్రాన్ని సీజ్ చేశారు. ప్రస్తుతం ఆ వైద్యుడు తిరిగి మరో గదిలో స్కానింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అధికారులు మళ్లీ ఆ లింగ నిర్ధారణ కేంద్రాన్ని జప్తు చేయాల్సి వచ్చింది. గతంలో ఈ కేంద్రాన్ని జప్తు చేసినట్లు గుర్తించిన అధికారులు నిర్వాహకుడిని ప్రశ్నించగా ఇది వేరే కేంద్రమంటూ బుకాయించాడు. అధికారులు ఆ కేంద్రాన్ని జప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.



వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వరద సహాయక చర్యల్లో మదనపల్లె ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడ వరద బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష తమ పార్టీ నాయకులతో కలిసి నేరుగా రంగంలోకి దిగారు. శుక్రవారం విజయవాడలో వరద వల్ల ఇబ్బంది పడుతున్న సింగ్‌నగర్, నందమూరి నగర్, రాధానగర్, బాంబే కాలనీ, రాయనపాడు, రాజీవ్ నగర్, ప్రకాష్ నగర్, పాయకాపురం, హుడా కాలనీ, కండ్రిగ, కాలనీలో పర్యటించారు. వరద బాధితులను నేరుగా కలిసి ఇంటింటికీ బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని అక్కడి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఎవరూ అధైర్య పడొద్దని సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం, దాతలు అన్ని విధాలా ఆదుకుంటారని తెలిపారు. ఆయా కాలనీల్లో ప్రతి ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, గ్యాస్ స్టౌవ్‌లు, బెడ్ షీట్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బాలు స్వామి, సీనియర్ అడ్వకేట్ గణపతి నాయుడు, మున్సిపల్ కమిషనర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య యూనివర్సిటీలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల నుండి బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పిసిబి (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు) అండ్ ప్రోటో టైప్ డెవలప్మెంట్ అనే అంశంపై జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఎస్.వి.టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వెంకట సుమంత్ పాల్గొని విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో వారు అధునాతనమైన ఎలక్ట్రానిక్ పరికరాలు తయారు చేయు విధానం, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ అనే టెక్నాలజీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పిసిబి రంగంలో భవిష్యత్తులో రాణించడానికి కావాల్సినటువంటి హ్యాండ్స్ ఆన్ శిక్షణ పొందారు. జాబ్ ప్రొఫైల్స్ ఇన్ పిసిబి డిజైన్, మోడ్రన్ టూల్స్ కెరియర్ అప్రోచ్‌ల ప్రయోజనాలు గురించి క్లుప్తంగా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో సాఫ్ట్ వేర్ సాధనాలను ఉపయోగించి సర్క్యూట్ డిజైన్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ ఫ్యాబ్రికేషన్‌ను ఎలా రూపొందించాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, ఇసిఇ విభాగాధిపతి, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ సి.హెచ్.నాగరాజు, టెక్నికల్ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ జి.తిరుమలయ్య, ఎం.హనుమంతు, కార్యక్రమ కో-ఆర్డినేటర్ బి.ఉమాకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ముస్తాక్ హుస్సేన్



ప్రజాశక్తి - రాయచోటి

ప్రముఖ వైద్యులు, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ దాదాసాహెబ్ కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండి ముస్తాక్ హుస్సేన్ శుక్రవారం రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడలోని సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి నారా లోకేష్ బాబును మర్యాదపూర్వకం కలసి రాయచోటి నియోజకవర్గంలో ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి నేతృత్వంలో రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని లోకేష్ బాబును కోరారు.

మున్సిపల్ చైర్మన్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తండ్రి ఇలియాస్ బాష అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఇలియాస్ బాష మృతిపట్ల వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులును ఫోన్ ద్వారా పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రి విచారం

ప్రజాశక్తి- రాయచోటి : చిత్తూరు జిల్లాలో శుక్రవారం మొగలి ఘాట్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రి సంతాపం తెలిపారు. గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై అరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

19న మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఈ నెల 19, 20వ తేదీలలో ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, 17 స్కూల్ గేమ్స్‌లో విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగమణి, పీడీ ఆనందమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న కబడ్డీ, వాలీబాల్, షటిల్, ఖోఖో ఉంటాయని, 20న మెగా అథ్లెటిక్స్ నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిజైన్ ఆప్టిమైజేషన్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్, ముఖ్య అతిథులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు డిజైన్ ఆప్టిమైజేషన్, పార్ట్ ప్రింటింగ్‌పై హ్యాండ్స్-ఆన్ 3డిపి వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యకమానికి రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ సోలమన్ బాబీ, డైరెక్టర్ (శిక్షణ), ఇఒఎస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ బెంగళూరు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫ్యూజ్డ్ డిపొజిషన్ మోడలింగ్, సెలెక్టివ్ లేజర్ సింటరింగ్, డైరెక్ట్ మెటల్ లేజర్ సింటరింగ్ సహా వివిధ రకాల 3డి ప్రింటింగ్ సాంకేతికతలను విద్యార్థులకు వివరించారు. పరిశ్రమల్లో వీటిని వాడే విధానాలను, ప్రింటింగ్ యొక్క సాంకేతిక అంశాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక మంచి ప్లాట్ ఫారమని పేర్కొన్నారు. 3డి ప్రింటింగ్ సిఎడి మోడల్ లేదా డిజిటల్ 3డి మోడల్ త్రిమితీయ వస్తువు యొక్క నిర్మాణమని, 3డి ప్రింటింగ్ దాని అనేక ప్రయోజనాల కారణంగా ఇంజినీరింగ్ రంగంలో వేగంగా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. 3డి ప్రింటింగ్ యొక్క దృష్టి డిజైన్, వ్యక్తిగతీకరణ, వికేంద్రీకరణ, ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా గతంలో అసాధ్యమైన ప్రక్రియలను సులువు తరం చేయడంలో ప్రాముఖ్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. వేగవంతమైన ఫొటోటైపింగ్‌ను ప్రారంభించడం, తయారీ ఖర్చులను తగ్గించడం, ఉత్పత్తి అనుకూలీకరణను పెంచడం, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడం వంటి ప్రయోజనాలెనో ఉన్నాయని తెలిపారు. 3డి ప్రింటింగ్ యొక్క సామర్థ్యాలు తయారీకి మించి విస్తరించాయని, తేలికపాటి నిర్మాణం, మరమ్మతులు, బయోప్రింటింగ్, ఆహార పరిశ్రమ, రాకెట్ నిర్మాణం, డిజైన్, ఆర్ట్ వంటి రంగాలలో ఎంతో అభివృద్ధి చెందినదన్నారు. కార్యక్రమంలో ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ డిజైన్ ఇంజనీర్ సి.కరుణాకరన్, ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ రిసోర్సు పర్సన్ సెల్వనాయకం, విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న జెడి

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం : జెడి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రకృతి వ్యవసాయంతో ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మండల బి .చంద్ర నాయక్, డిపిఎం ఎస్.వి.ప్రవీణ్ కుమార్ జిల్లాలోని అందరూ మండల వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో అధికారులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, ప్రకృతి వ్యవసాయంలో తయారుచేసే వివిధ రకాల ద్రావణాలు, ఘన, ద్రవ, బీజమృతలను తయారు చేసి అలాగే పిఎండిస్, ఎటిఎం, ఎ గ్రేడ్ మోడల్స్‌ను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో వ్యవసాయ అధికారులు చర్చించి విధానాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజలకు మంచి ఆరోగ్యం, ఆహారం, రైతులు లాభాలు పొందవచ్చని తెలియచేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎడిఎలు మండల వ్యవసాయ అధికారులు , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) 2024-25విద్యా సంవతరానికి సంబంధించి పది, ఇంటర్ కోర్సులలో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అపరాదరుసుం లేకుండా ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 25 వరకు అవకాశం వుందన్నారు. దాదాపు అన్నమయ్య జిల్లాలో అన్ని మండలాల్లో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లున్నాయని వాటి ద్వారా దరఖాస్తు చేసుకుని విద్యార్హత పొందాలని జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రాజు తెలియజేశారు. అర్హత గల అభ్యర్థులు www.apopenschool.ap.gov.inవెబ్ సైట్‌లో చూసుకోవాలని సూచించారు.


పీలేరు: కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా 'నల్లారి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి.పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిల జన్మదిన వేడుకల కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో వేర్వేరుగా భారీ సైజ్ కేక్‌లు కట్ చేసి, సుమారు రెండువేల మందికి అన్నదాన కార్యక్రమం చేశారు.కార్యక్రమంలో వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఎ.అమరనాథ్‌రెడ్డి, బిసి నాయకులు పురం రామ్మూర్తి, వసంతారాజ, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు కోటపల్లి బాబురెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, షఫీవుల్లా, రెడ్డిబాషా,కూటమి నాయకులు పాల్గొన్నారు. **కలకడ:**ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వహించారు. మండల కేంద్రమైన కలకడ టిడిపి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు తెలిపారు. టిడిపి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు కలికిరి టిడిపి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు, నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిల జన్మదిన వేడుకలను టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నల్లారి అమర్నాథ్ రెడ్డి భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని విధాల అభివృద్ధి చేస్తూ అందరూ అభిమానాలు చేరుకున్న నాయకులు నల్లారి కిరణ్, కిషోర్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరమణరెడ్డి, చంద్రశేఖర్, సనావుల్లా, జనార్దన్ గౌడ్, అగస్టీశ్వర్, సిద్దయ్య, శ్రీనివాస వర్మ,బయన్న, విజయ్ కుమార్, దాము, ఏతేంద్ర తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిట్వేలిలో కెకె చౌదరి..

చిట్వేలి: టిడిపి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు, చిట్వేలు మండలం మండల అధ్యక్షుడు కెకె చౌదరి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో విద్యార్థి దశ నుండి రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటూ రాజకీయాల్లో సేవలందిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని టిడిపిమండల ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, యువ నాయకుడు కళ్యాణ్ నాగార్జున కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ శంకర్‌రాజు, చిన్న, రవీంద్రరాజు, చంద్ర మౌళి, అర్జున్ శివ, శివగౌడ్, అజయ్,వరుణ్,సుబ్బరాజు,భార్గవ్,పెంచలయ్య, అచ్యుత కుమార్, సాయిరాం వాసు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఎపిటిఎఫ్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కలికిరి: ఎపిటిఎఫ్ జిల్లా మహాసభల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమార్‌యాదవ్, జిలియాజులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం రాయచోటిలోని మాసాపేట జడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా మహాసభలకు ఉపాధ్యాయులు హాజరై తమ సమస్యలు, హక్కులు, బాధ్యతలు, చట్ట నిబంధనలు వంటి అంశాల గురించి చర్చించి మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆర్థిక బకాయిలు చెల్లింపు, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్ మెంట్, ఫిఎఫ్ ,ఎపిజిఎల్‌ఐ లోన్లు మంజూరు, ఉపసంహరణ నిధులు మంజూరు వంటి అంశాలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు.

మరోమారు మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-కలికిరి: కోరం లేకపోవడంతో మరోకసారి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా గత నెలలో సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా సభ్యులు హాజరుకాక పోవడంతో కోరం లేక వాయిదా పడింది. మరోసారి నిర్వహించాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో వరుసగా రెండవసారి కూడా వాయిదా పడింది. సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపి డిఒ కార్యాలయం ఎదుట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకో కుండా సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-నందలూరు

పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన పొత్తపి గ్రామంలోని గేదెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు తగునీరు, దోమకాటు, పాడి పశువుల్లో గొంతు వాపు వ్యాధికి కారణమవుతుందని అన్నారు. ఈ వ్యాధికి సరైన చికిత్స అందకపోతే మరణించే అవకాశం ఉందని అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు మిగతా జీవాలను దూరంగా ఉంచాలని సూచించారు. టీకాలు వేస్తే పాలు తక్కువ ఇస్తాయి అన్న అపోహతో యజమానులు వేయించడం లేదని తప్పక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా పశు వ్యాధుల నిర్ధారణ అధికారి డాక్టర్ రాజశేఖర్,డాక్టర్ ప్రతాప్, పశు వైద్యాధికారి అశ్విని పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం వైద్య సిబ్బంది విద్యార్థులకు హెచ్‌బి రక్త పరీక్షలు నిర్వహించారు. పోష్టికాహార లోపం ఉంటే అనీమియా లాంటి నష్ట నత వ్యాధులు వస్తాయని, రక్తహీ నత ద్వారా నేటి విద్యార్థులు యువత అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రిన్సిపల్ రమేష్ విద్యార్థులకు వివరించారు. ఎత్తుకు తగ్గ బరువు, పౌష్టికాహారం, ఆకుకూరలు, పండ్లు, మొద లగు సూచనలు పాటించిన యెడల అనీమియా వ్యాధిని సమూలంగా ఎదుర్కొనవచ్చని నవీన్ కుమార్ సూచించారు. వైద్యసిబ్బంది బేబీ, నాగరాణి, మారుతి,ల్యాబ్ అసిస్టెంట్ ద్వారా విద్యార్థులకు హిమో గ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అనీమియా బాధితులకు ఐరన్ టాబ్లెట్లు, టానిక్‌లు, విద్యార్థులకు అందించారు. హిందీ దివస్ సంబరాలు పాఠశాలలో నిర్వహించారు. కార్యక్ర మంలో సుబ్బరాయుడు, ఇక్బాల్, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విషజ్వరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు కరస్పాండెంట్ ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప పర్యవేక్షణలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, ఫైలెరియా, డెంగీ, చికెన్‌గున్యా మెదడువాపు జ్వరాలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్ విద్యార్థులకు వివరించి చెప్పారు. ఈ ఐదు రకాల జ్వరాలు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని, ప్రజారోగ్యానికి ప్రమాదమని అన్నారు. తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు మలేరియాలో కనిపిస్తాయని అన్నారు. వ్యాధి లక్షణాలను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని అన్నారు. విష జ్వరాలకు దూరంగా ఉండాలంటే కొన్ని నివారణా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవడం, పందులను గ్రామానికి 5కి.మీ దూరంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. నీటి నిల్వలపై మూతలు ఉంచాలని, దోమతెరలు వాడటం, కిటికీలకు మెష్ కొట్టించడం, ప్రతీరోజూ సాయంత్రం ఇంటిలో పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని, ప్రతీ రోజు ఇంటిలో సాయంత్రం లైట్స్ వేసినప్పుడు తలుపులు, కిటికీలు మూసివేయాలన్నారు. కాలువలలో చెత్తవీయరాదని, గర్భిణులు, బాలింతలు, పది సంవత్సరాలు లోపు పిల్లలు, అరవై సంవత్సరాలు పైబడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువ కనుక ఈ వర్గానికి చెందిన వారు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. దోమల నిర్మూలన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే దోమలపై దండయాత్ర విజయవంతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఆదినారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చిన్న రెడ్డెప్ప

జోరుగా సాగుతున్న 'ఉపాధి' పనులు


పొలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని వీరమనేనిపాలెం గ్రామపంచాయతీలో కుప్పగుట్ట వారిపల్లెలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయని ఉపాధి హామీ టెక్నికల్, అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి,రాజేంద్ర తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని దినాలు కల్పిస్తు న్నట్లు తెలిపారు. ప్రతివారం మాస్టర్ బిల్లులు పెట్టి కూలీలకు వారి బ్యాంకు ఖాతాలో వేతనాన్ని జమ చేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కూలీలకు ఏ వారానికి సంబంధించి ఆ వారమే పంపిస్తున్నామని అన్నారు. వ్యవసాయ పొలంలో వర్షం నీరు రావడంతో గట్టులు వేయడంతో నీరు భూ మిలోనే ఇంకిపోతుందని ఇది రైతుకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఉపాధి పనుల ద్వారా ఇలాంటి పనులు చేయడం వల్ల రైతుకు చాలా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చెరువు రాజేంద్ర, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయకుడి నిమజ్జనం


కలకడ:గణపతి విగ్రహానికి నిమజ్జనానికి తరలిస్తున్న యువత


వేలంపాటలో దక్కించుకున్న లడ్డూ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ పరిధిలోని పోకనాటి వీధి శ్రీకోదండరామస్వామి దేవస్థానం దగ్గర గణేశ విగ్రహానికి ఏడు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక కమిటీ, ధర్మకర్తలు ఆధ్వర్యంలో ప్రతిరోజూ విశేష అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వ హించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో,కేరళ నుంచి వచ్చిన కళాకారులతో మేళ తాళాలతో బాణాసంచా పేలుస్తూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గణపతికి సమర్పించిన లడ్డూ ను వేలంపాట ద్వారా గుంతూరు రామంజి రూ.30 వేలకు దక్కించుకున్నారు.

రూ.1.16 లక్షలు పలికిన యర్రజేనివారిపల్లి లడ్డూ

యర్రజేనివారిపల్లి గణేషుడి నిమజ్జనం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా వినాయక లడ్డూ వేలం పాటలో లక్ష 16 వేలకు మహేష్‌కుమార్‌రెడ్డి అనే యువకుడు దక్కించుకున్నాడు. .కురబలకోట మండలం, యర్రజేనివారిపల్లి యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం వేడుకలను ఎంతో వైభవంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో ఎన్.బాలకృష్ణారెడ్డి,బి.గణేష్ కుమార్,ఆర్.రాజశేఖర్‌రెడ్డి, గంగాధర, అభిషేక్‌రెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, వై.విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్.పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. **సంబేపల్లి:** మండలంలోని సంబేపల్లి టౌన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు టిడిపి యువ నాయకులు నిశ్చల్ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నాగిరెడ్డి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. **కలకడ:** మండలంలోగణపతి నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు పంచాయతీలో వినాయకుని విగ్రహాలను నిమజ్జన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దేవులపల్లి పంచాయతీ గొబ్బిళ్ళవారిపల్లి, ఎగువ పల్లెలలో బొజ్జ గణపయ్యను చాందిని బండ్లపై ఊరేగించి రంగులు చల్లుకుంటూ యువత కేరింతల కొడుతూ బళ్లారి డప్పుల మధ్య నాట్య విన్యాసాలు చేస్తూ నిమజ్జనం చేశారు. గొబ్బిళ్ళవారిపల్లెలో లడ్డూ వేలంపాటలోహోంగార్డు నాగిరెడ్డి రూ.28వేలకు కైవసం చేసుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

వాల్మీకిపురం ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం



వాల్మీకిపురం ఎస్ఐగా చంద్రశేఖర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తు న్న ఎస్ఐ నాగేశ్వరరావు బదిలీపై అన్నమయ్య జిల్లాకు వెళ్లగా రామ సముద్రంలో ఎస్ఐగా పని చేస్తు న్న చంద్రశేఖర్ బదిలీపె వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసు కుంటామని అన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా గుట్టు చప్పుడు కాకుండా గుట్కా, హాన్స్, నాటుసారా, కర్ణాటక మద్యం వంటి నిషేధిత వస్తువులు అమ్మితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితేఉపేక్షిం చేది లేదనిహెచ్చరించారు.

మదనపల్లె టూటౌన్ ఎస్ఐగా రవికుమార్



ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె టూ టౌన్ ఎస్ఐగా రవి కుమార్ బాధ్యతలు చేపట్టారు. బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయన రామ సముద్రం నుండి మదనపల్లి టూ టౌన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా నన్నారు. గతంలో తాను మదనపల్లె తాలూకా ఎస్ఐ విధులు నిర్వహిం చానని, ఆ అనుభవం తనకు ప్రస్తుతం దోహదపడుతుందని అన్నారు. పట్టణ ప్రజలు, యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తద్వారా ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి సహకరించాలని కోరారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు పోలీసు అధికారులు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వరదల కారణంగా సర్వం కోల్పోయిన విజయవాడ బాధితులకు మదనపల్లి టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌భాషా ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలోని సింగ నగర్‌కాలనీ ప్రాంతాలలోని వరద బాధితులకు ఇంటింటికీ వెళ్ళి నిత్యవసర సరుకులు, కూరగాయలు, గ్యాస్ స్టౌవులు, దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బాలుస్వామి, సీనియర్ అడ్వకేట్ గణపతినాయుడు, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీలలు సహాయక చర్యలలో పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా గణపతి నాయుడు మాట్లాడుతూ విజయవాడలో పరిస్థితులు హృదయ విదారకంగా ఉన్నాయన్నారు. అక్కడ పరిస్థితులు చక్కదిద్దేందుకు సిఎం, మంత్రులు శ్రమిస్తున్నారని అన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-నందలూరు

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టులో ఆమె మొక్కలు నాటే కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నరసిం హులు, సుబ్బరామయ్య, ఆనంద్, మోహన్, షేక్, అనుదీప్, కోర్టుసిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


ఎస్ఐను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నూతన ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రం మండలానికి నూతనంగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన సి.వెంకట సుబ్బయ్యను శుక్రవారం టిడిపి మండలఅధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రామసముద్రం పట్టణంలో ఇరుకైన రోడ్లు ఉండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొందని దీనికి తోడు వ్యాపార సముదాయాల వద్ద ద్విచక్ర వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ఉదయం - సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ స్పందిస్తూ వ్యాపార దుకాణాల వద్ద సరి బేసి పద్ధతిలో రోజుకు ఓ ప్రక్కన ద్విచక్ర వాహనాలు నిలుపుటకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. బస్సులు హైస్కూల్ సమీపంలోని బస్టాండ్‌లో వాహనాలు నిలుపుటకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రదీప్‌గౌడ్, మాజీ జడ్‌పిటిసి సభ్యులు ముని వెంకటస్వామి, మాజీ సర్పంచి వెంకటప్ప, బద్రీనాథ్, బి.శివ, ఆంజప్ప, రంగాని వెంకటేష్, రెడ్డెప్ప, దినేష్, జావిద్, రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక అరవపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నందలూరు హెచ్.ఎం శ్రీనివాసులు, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ క్రిష్ణయ్య, అసిస్టెంట్ హెచ్.ఎం షేక్ రౌఫ్ బాష లు మట్లాడుతూ అండర్-14, అండర్-17 విభాగాల్లో విడివిడిగా బాల బాలికలకు శుక్రవారం చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు.ప్రతి క్రీడలో గెలుపు ఓటములు సహ జమని పేర్కొన్నారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి రాజంపేట డివిజన్ పరిధిలో త్వరలో ఏడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని చెప్పారు.సెల్‌ఫోన్లు, టివిలలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదో ఒక క్రీడలో నైపుణ్యం పెంచుకొని రాణించాలన్నారు. అథ్లెటిక్స్‌లో నైపుణ్యం సాధించే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రతి రోజూ మైదనానికి వెళ్లి యోగా, వ్యాయంతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్ర మంలో మండలం లోని పీడీలు గౌరీ, సరిత, సుష్మిత, విశ్వనాథ్,జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగాలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు



రాజేంద్ర సింహ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

హిందీ భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జడ్‌పిహైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయభాష హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హిందీకి జాతీయ భాష హోదా కొరకు పోరాడిన దివంగత ప్రముఖ హిందీ రచయిత రాజేంద్ర సింహ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయుడు ఎం. రమణారెడ్డి మాట్లాడుతూ హిందీ భాష చాలా ప్రాచీన మైనదని, ప్రతి ఒక్కరూ తమ మాతృభాషతో పాటు జాతీయ భాష అయిన టువంటి హిందీని తప్పకుండా నేర్చుకోవాలన్నారు. హిందీ నేర్చుకుంటే ఉత్తర భారత దేశంలోని చారిత్రాత్మక ప్రదేశాలను, పుణ్యస్థలాలను ఏ ఇబ్బంది లేకుండా చూసి రావచ్చున్నారు. హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లా డుతూ మన దేశంలో 14 పైగా రాష్ట్రాలలో హిందీ మాతృభాషగా ఉందన్నారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో హిందీ మూడోస్థానంలో ఉందని చెప్పారు. హిందీ భాషతో అనేక ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. తదనంతరం సెల్ఫ్ అసెస్మెంట్-1 హిందీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల నరసింహులు, రమణయ్య, గిరిధర్, శేషాద్రి, షామీర్‌బాషా, ప్రమీలకుమారి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు



ర్యాలీ నిర్వహిస్తున్న బిస్మిల్లా ఆటోయూనియన్‌నాయకులు

పీలేరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ వజ్రాల చాన్‌బాషా కుటుంబాన్ని ఆదుకోవాలని బిస్మిల్లా ఆటో యూనియన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పీలేరు-తిరు పతి రహదారిలోని ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలో గురువారం ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో చాన్‌బాషా తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.బోదేషా వలి మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు దాతలు కూడా ముందుకు వచ్చి పేదవాడైన ఆటో డ్రైవర్ చాన్‌బాషా భార్య, ముగ్గురు చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచు కుని వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇబ్రహీం, ఉపాధ్యక్షులు ఖాజా, హనీఫ్, మధు, యూసఫ్, జీలానీ సాహెబ్, ఖాదర్ బాష, సీను, హసన్ బాష, ఖాసీం సాహెబ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు..సంబేపల్లి మండలం ఎస్.సోమవారం పంచా యతీ ఆగ్రహారంకు చెందిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు నగిరి మడుగు పెద్దనాగన్న (75)తన సొంత ద్విచక్ర వాహనంలో ఈనెల 11న బుధవారం కలకడలో జరిగే సంతకు బయలు దేరినట్లు తెలిపారు. నాగన్న బయ లుదేరు సమయంలో అతని ద్విచక్ర వాహనంలో గుడిబండ పంచాయతీ గొల్లపల్లికు చెందిన రాసిమాను రామచంద్ర అనే వ్యక్తితో కలిసి కలకడకు వస్తున్నట్లు తెలిపారు. వీరు ఇద్దరూ స్థానిక కలకడ సమీపంలో ఉన్న సత్యవతి నదిపై నిర్మించిన వంతెన సమీపంలో బాలయ్య గారి పల్లి పంచా యతీ ఎర్రయ్యగారిపల్లి ఎస్‌టి కాలనీకి చెందిన బుకే బాబునాయక్ కుమారుడు బుక్కే మల్లి కార్జుననాయక్ తన ద్విచక్ర వాహనంలో అతివేగంగా ,అజాగ్రత్తగా వచ్చి ఎదురుగా వస్తున్న నాగన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో నగిరిమడుగు పెద్ద నాగన్నకు కుడి కాలు కుడి చేయి విరిగినట్లుగా తెలిపారు. అనంతరం ముఖానికి రక్త గాయాలు కాగా మరో వ్యక్తి రామచంద్ర కు కుడి మోకాలు వద్ద బలమైన రక్త గాయం కాగా మహల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేసుకొని, మదన పల్లిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. పెద్ద నాగన్న ప్రమాద స్థలం నుంచి 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని సంకల్ప మల్టీ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించి వైద్యసేవల అంది స్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గురైన నాగ న్న కుమారుడు సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వెల్డర్ దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగళ్ళు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వెల్డర్ దుర్మరణం చెందాడు. ఘటనపై ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, అంగళ్ళు-సిటిఎం రోడ్డులోని పాల డెయిరి వద్ద శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటరిస్ట్ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుని ఆచూకీ కోసం ఆరా తీశారు. మదనపల్లి మండలం, చిన్న తిప్పసముద్రం గ్రామం, చిలకవారిపల్లెకు చెందిన రామయ్య కొడుకు వెల్డర్ శివమణి (22)గా పోలీసులు గుర్తించారు. అంగళ్లులో ఓ షెడ్డుకు పనులు చేసి బైకులో ఇంటికి వెళ్లే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్, లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా, ఎర్రావారిపాలెం మండలం, బోయపల్లికి చెందిన ఏ.మార్కండేయులు (54) తలుపుల వైపు నుంచి తన ఊరికి వెళుతుండగా పీలేరు మండలం, రాజుల వారి పల్లి సమీపంలో విద్యుత్ స్తంభాల లోడుతో పీలేరు వైపు వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో గొర్రెల మంద కోసం వచ్చిన మార్కండేయులు ప్రమాద స్థలంలోని మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

వినాయకుడి నిమజ్జనంలో గొడవ

యువకుడి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినాయకుడి నిమజ్జనం సందర్భంగా యువకుల మధ్య జరిగిన గొడవ ఓ యువకుడి బలవన్మరణానికి కారణమైంది. తంబళ్లపల్లె పోలీసుల కథనం మేరకు..మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ, దిగువ ముత్ర వారిపల్లెకు చెందిన ధనంజయ (19) ఈ నెల10న గ్రామంలో వినాయకుడి నిమజ్జనం జరుగుతుంటే వెళ్ళాడు. సహచరులు రంగులు చల్లడంతో గొడవ పడ్డాడు. దీంతో అతని బట్టలు చిరిగిపోయాయి. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆ యువకుడు ఇంటి కొచ్చి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి వెంటనే బాధితున్ని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. అయినా కోలుకోలేదు. శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.